క్లుప్తంగా

మద్ది అంజన్నను దర్శించుకున్న కైకలూరు ఎమ్మెల్యే



ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు వేద ఆశీర్వచనాలు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని సోమవారం కైకలూరు ఎమ్మెల్యే డి.నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం ఆలయ వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. నాగేశ్వరరావుకి ఈవో కొండలరావు శేషవస్త్రాన్ని కప్పి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

రిటైల్ అవుట్‌లెట్ తనిఖీ



జంగారెడ్డిగూడెంలో ఎఫ్‌పీఓను పరిశీలిస్తున్న హార్టీకల్చర్ డీడీ ఎస్.రామ్మోహన్

జంగారెడ్డిగూడెం: విలేజ్ వెజిటబుల్స్ ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ రిటైల్ అవుట్‌లెట్‌ను హార్టీకల్చర్ డీడీ ఎస్.రామ్మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిటైల్ అవుట్‌లెట్‌లో పనితీరును, రికార్డులను పరిశీలించారు. పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా చేనేత దినోత్సవం

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం 9వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రుస్తుంబాదలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్లో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపీసీహెచ్) ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు సీనియర్ చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈపీసీహెచ్ దక్షిణాది రాష్ట్రాల సంచాలకుడు కలవకొలను నాగ తులసీరావు మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవన విధానాన్ని మెరుగు పరిచేందుకు ఈపీసీహెచ్ సంస్థ ద్వారా తమ వంతు సహకారాన్ని అందించేందుకు కృషిచేస్తానన్నారు. వాస్తవానికి చేనేత రంగంలో పనిచేసే కార్మికులకు బయట ఇతర పనులు నిర్వహించే కార్మికులకంటే తక్కువ వేతనం వస్తుందన్నారు. చేనేత కార్మికులు సంఘాలుగా ఏర్పడి చేనేత వస్త్రాలను స్వయంగా ఎగుమతి చేసే స్థాయికి ఎదిగేలా తయారు కావాలన్నారు. అందుకు అవసరమైన పెట్టుబడి, ముడిసరుకులను చేనేత కార్మికులకు అందించేలా ప్రభుత్వాలు కృషి చేయాలని తులసీరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు యర్రా ఉమ, గోరు రమాదేవి, యర్రా శ్రీనివాసు, లేస్ ఎక్స్‌పోర్టర్లు అడ్డగళ్ల బాబు, మాదాసు గిరివాసు, అడ్డగళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 18వ వార్డు, వనువులమ్మగుడి వద్ద తదితర ప్రాంతాల్లో వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీకర ప్రసాద్ జెండా ఆవిష్కరించారు. అనంతరం వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ నాయులు సమతం శివప్రసాద్ మాట్లాడుతూ. విదేశీ వస్తు బహిష్కరణలో కీలక పాత్ర వహించిన చేనేత రంగానికి గుర్తింపునిస్తూ ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేసి, చేనేత వృత్తిని ఆదుకోవాలని పలువురు నేతలు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలో చేనేత ఉత్పత్తులు వాడేవిధంగా ప్రోత్సహించాలన్నారు.



అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్‌లో చేనేత కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

మహిళల ఆర్థిక చేయూతకు సీఎం కృషి

పెనుగొండ: మహిళలకు ఆర్థిక పరిపుష్టి కల్పించడానికి డ్వాక్రా అధికారులు కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం తూర్పుపాలెంలో డీఆర్‌డీఏ, డ్వాక్రా సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రతీ మహిళకు అండగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. దీనికి అనుగుణంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, వాటి లబ్ధి నేరుగా మహిళల ఖాతాల్లోకి జమ చేస్తున్నారన్నారు. ముఖ్యంగా డ్వాక్రా రుణమాఫీపై ఇచ్చిన మాటకు కట్టుబడి మూడు విడతలు చేశారన్నారు. నాలుగో విడత సైతం సంక్షేమ క్యాలెండర్ ప్రకారం జమ చేస్తారన్నారు. త్వరలోనే సున్నా వడ్డీ మహిళల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. గతంలో ఏనాడు సక్రమంగా మహిళలకు వడ్డీ డబ్బులు అందించలేదన్నారు. సీఎం జగన్ పాలన చేపట్టిన అనంతరం సంక్షేమ క్యాలెండర్ ప్రకారం నిర్ణీత తేదీన జమ చేస్తూ అండగా నిలుస్తున్నరన్నారు. స్త్రీనిధి, డ్వాక్రా రుణాలతో మహిళలు చిరు వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. దీని ద్వారా కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నారు. పారదర్శకంగా గ్రూపులకు అండగా నిలవాలన్నారు. ఎస్సీ గ్రూపులను మరింతగా పెంచి వారికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వేణుగోపాల్, పెనుమంట్ర ఎంపీపీ కేవీఎన్ నారాయణ రెడ్డి(వాసు), జడ్పీటీసీలు కర్రి గౌరి సుభాషిణి, గుంటూరి పెద్దిరాజు, డీపీఎం శ్రీనివాస్, ఏపీఎంలు ఏ రామకృష్ణ, బీ రామకృష్ణ, పార్టీ నాయకులు రుద్రరాజు శివాజీ రాజు, గుబ్బల వీర బ్రహ్మం, మేడిచర్ల పండు, దంపనబోయిన బాబూరావులు పాల్గొన్నారు.



తూర్పుపాలెంలో డ్వాక్రా అధికారుల సమీక్షలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలు

తెలంగాణ రాష్ట్రంలో ఘటన

టి.నర్సాపురం: తెలంగాణలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టి.నర్సాపురం మండలానికి చెందిన 13 మంది గాయపడ్డారు. ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంకు చెందిన 13 మంది కూలీలు మధ్యాహ్నపువారిగూడెం గ్రామానికి చెందిన బొలెరో వాహనంలో కూలి పని నిమిత్తం తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా దమ్మపేటకు వెళ్లారు. తెలంగాణ రాష్ట్రం దమ్మపేట సమీపంలో మందలపల్లి వద్ద ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొని బొలేరో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు హోంగార్డుల్లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో హోంగార్డు తీవ్రంగా గాయపడ్డారు. బొలెరోలోని 13 మంది కూలీలతో పాటు డ్రైవర్ గాయపడ్డారు. గాయపడిన వారిలో సత్యనారాయణ అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించగా 13 మంది జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



ప్రమాద ఘటన స్థలంలో గాయాలతో క్షతగాత్రులు

33 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఇండస్ట్రియల్ ఏరియా నుంచి జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అధికారులు చెక్ పెట్టారు. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాలతో సోమవారం ఉదయం విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ సిబ్బందితో కలిసి భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ షాపులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం, వాహనాలను సీజ్ చేశారు. బియ్యం వ్యాపారం చేస్తున్న అద్దెపల్లి సోమేశ్వర కృష్ణ కిషోర్, వ్యాపారానికి సహకరిస్తున్న మరో నలుగురిపై కేసులు నమోదు చేశారు. సీఐ వివరాల ప్రకారం కిషోర్ బైక్‌పై బియ్యం సేకరించిన అద్దెకు తీసుకున్న షాపులో నిల్వ చేసి అక్కడ నుంచి చేపల చెరువులకు అమ్మేవాడు. సోమవారం బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. కిషోర్‌కు బియ్యం సరఫరా చేసే ఎస్.సత్యనారాయణ, కె.రాంబాబును, కిషోర్ గుమస్తా కె.రామాంజనేయులు, వ్యాన్ డ్రైవరు పి.నాగరాజును అదుపులోకి తీసుకుని మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి 33 క్వింటాళ్ల బియ్యం, వ్యాన్, రెండు మోటార్ సైకిల్స్ స్వాధీనం చేసుకున్నారు.



భీమవరం ఇండస్ట్రియల్ ప్రాంతంలో రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం, నిందితులతో విజిలెన్స్ అధికారులు

బియ్యం లారీ సీజ్

లింగపాలెం: అక్రమంగా తరలిస్తున్న పీడీయస్ బియ్యం లారీని విజిలెన్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా వీర్లపాడు మండలం నుంచి అక్రమంగా బియ్యంను లారీపై కాకినాడకు తరలిస్తుండగా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం శివారు వలసపల్లి అడ్డరోడ్డు వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. ఏపీ 05 టిపి 3357 నెంబరు లారీలో 24,700 కేజీల బియ్యంను పట్టుకోగా విలువ రూ.4,44,600 ఉటుందని తెలిపారు. బియ్యం లారీని సీఎస్‌డీటీ ద్వారా స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు అండగా..

- సున్నా వడ్డీతో ఆర్థిక ప్రయోజనం
- జిల్లాలో నాలుగేళ్లలో రూ.219.65 కోట్ల ప్రయోజనం
- ఈ నెల 11న సున్నా వడ్డీ జమ

భీమవరం(ప్రకాశం చౌక్): డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు అన్నగా, తమ్ముడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ఒక పక్క వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తునే మరో పక్క డ్వాక్రా రుణామాఫీ చేస్తున్నారు. దాంతో పాటు వారు తీసుకుంటున్న రుణాలకు వడ్డీ ప్రభుత్వం చెల్లిస్తున్న వడ్డీకే రుణాలు అందిస్తున్నారు.

నాలుగో విడత రూ.44.41 కోట్ల జమ

డ్వాక్రా మహిళలు వారు తీసుకున్న రుణం బట్టి వారికి సున్నా వడ్డీ కింద రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు తిరిగి ఇస్తున్నారు. ఒక్కో సభ్యురాలు ఇంతవరకు రూ.12 వేల నుంచి రూ.36 వేలు అందుకున్నారు. ఈ ఏడాది నాలుగో విడతగా జిల్లాలో 31,682 గ్రూపులకు రూ.44.41 కోట్లను సున్నా వడ్డీ కోసం ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఈ నెల 11న డ్వాక్రా గ్రూపులకు నాలుగో విడత సున్నా వడ్డీని డ్వాక్రా గ్రూపు సభ్యుల ఖాతాల్లో జమచేయనున్నారు. మొత్తం నాలుగు విడతాలుగా 31,943 గ్రూపులకు రూ.219.65 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.



హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

క్రమం తప్పకుండా రుణామాఫీతో పాటు సున్నా వడ్డీ కూడా అమలు చేయడంపై డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు ఇస్తున్న ఆర్థిక భరోసా చాలా గొప్పదని వారు అంటున్నారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ విషయంలో తాము మోసం పోయామని, ఈ ప్రభుత్వం రుణామాఫీతో పాటు నాడు రాజశేఖరెడ్డి పాలనలో అమలు చేసిన విధంగా సున్నా వడ్డీ అమలు చేయడం సంతోషంగా ఉందంటున్నారు.

జిల్లాలో సున్నా వడ్డీ అమలు తీరు

ఏడాది	గ్రూపులు	లబ్ధి(రూ.కోట్లలో)
2019-20	26,451	68.61
2020-21	29,611	48.72
2021-22	31,943	57.91
2022-23	31,682	44.41

మూడు విడతల వడ్డీ అందుకున్నాను



నాకు గత మూడు విడతలగా వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.6,600 అందుకున్నాను. ఈ ఏడాది మరో రూ.2,100 తో కలిపి నాలుగు విడతలగాను రూ.8,400 సున్నా వడ్డీ ద్వారా ప్రభుత్వం చెల్లించినట్లవుతుంది.

– ఏ.వెంకట స్రవంతి, పెన్నాడ, పాలకోడేరు మండలం

సున్నా వడ్డీ అమలు సంతోషదాయకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక పక్క డ్వాక్రా రుణమాఫీతో పాటు మరో పక్క సున్నా వడ్డీ కూడా అమలు చేయడం సంతోషం. నాకు వైఎస్సార్ సున్నావడ్డీ మూడు విడతలకు రూ.8,291 వచ్చింది. ఈ ఏడాది నాలుగో విడతతో మొత్తం రూ.10,216 అందించినట్లు అవుతుంది.

– కర్రి నాగమణి, పెనుగొండ

రూ.44.41 కోట్ల చెల్లింపు



డ్వాక్రా గ్రూపులకు సంబంధించి 4వ విడత వైఎస్సార్ సున్నావడ్డీ చెల్లింపు కోసం ఈ నెల 11న గ్రూపు సభ్యుల ఖాతాలకు జమ చేస్తాం. ఈ ఏడాది 4వ విడతకు సంబంధించి 31,682 గ్రూపులకు రూ.44.41 కోట్లు చెల్లిస్తున్నారు. ఇంతవరకూ 4 విడతలకు రూ.219.65 కోట్లు ప్రభుత్వం ఖర్చుచేసింది.

– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ

సందీప్ జాడ కోసం డ్రెయిన్‌లో గాలింపు



సోమేంద్ర వెంకట సందీప్ (ఫైల్)

సాక్షి,భీమవరం: ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి అదృశ్యమైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కె.సోమేంద్ర వెంకట సందీప్ కోసం సోమవారం పోలీసు, ఫైర్ సిబ్బంది పట్టణంలోని యనమదుర్రు డ్రెయిన్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలోని నర్సయ్య అగ్రహారానికి చెందిన కె.సత్యనారాయణ కుమారుడు సందీప్ కనిపించడం లేదంటూ ఆదివారం వన్‌టౌన్ పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేయడం తెలిసిందే. సందీప్ స్కూటర్ పట్టణంలోని గరగపర్రురోడ్డులోని బీవీ రాజు విగ్రహం సమీపంలోని యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనపై పార్క్‌చేసి ఉండడంతోపాటు తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ సందీప్ రాసిన లేఖ ఇంటిలో లభ్యం కావడంతో డ్రెయిన్‌లోకి దూకి ఉంటాడనే అనుమానంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసు సిబ్బంది డ్రెయిన్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే సందీప్ ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం బోట్ సహాయంతో గాలించనున్నట్లు అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు చెప్పారు.



సందీప్ కోసం యనమదుర్రు డ్రెయిన్‌లో గాలిస్తున్న సిబ్బంది

చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : స్థానిక లూథరన్ చర్చి వీధిలో ఒక ఇంట్లో జరిగిన చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెచ్‌సీ జె.మోషేన్ తెలిపిన వివరాల ప్రకారం చిట్టిబోయిన వెంకటేశ్వరరావు కుమారుడు కుటుంబ సభ్యులతో సహా వ్యవసాయం పనుల నిమిత్తం తిర్నాలకుంట వెళ్లారు. ఈనెల 5వ తేదీ రాత్రి వెంకటేశ్వరరావు తన కుమారుడు ఇంటి వైపు చూసేసరికి తలుపులు తీసీ ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా బంగారం వస్తువులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. 6 కాసుల బంగారం వస్తువులు, 30 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జె.మోహేషన్ తెలిపారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు కృషి

ద్వారకాతిరుమల: గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని గుండుగొలనుకుంట అంగన్‌వాడీ కేంద్రంలో, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రక్తహీనతను తొలగించేందుకు గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. వ్యయ ప్రయాసలతో వారు అంగన్‌వాడీ కేంద్రాలకు రాకూడదన్న ఉద్దేశ్యంతోనే టేక్ హోమ్ కిట్లను అందిస్తున్నామన్నారు. ఈ కిట్లలో బియ్యం, కందిపప్పు, వంటనూనె, కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, రాగి పిండి, అటుకులు, బెల్లం, వేరుశనగ చిక్కీ, ఎండు ఖర్జూరం వంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. మూడేళ్ల వయస్సు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లులకు సూచించారు. అనంతరం ద్వారకాతిరుమలకు చెందిన దివ్యాంగుడు బెజ్జు ప్రసాద్‌కు ప్రభుత్వం ద్వారా త్రీ వీలర్ స్కూటీని అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, స్థానిక సర్పంచ్ బండారు ధనలక్ష్మి, సొసైటీ చైర్మన్ గోపా నాగేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జేవీ కృష్ణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, షేక్ బాషా, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, మానుకొండ సుబ్బారావు, ఐసీడీఎస్ జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్ సీడీపీఓ పి.బ్యూలా, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



కుందేటి రాంబాబు

ఆగిరిపల్లి(నూజివీడు): వ్యక్తి అదృశ్యంపై ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణాజిల్లా గన్నవరం మండలం గొల్లనపల్లికి చెందిన కుందేటి రాంబాబు(55) ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులోని మామిడితోటలో కాపలా నిమిత్తం భార్యతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 1న తోటలోని ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఎక్కడకు వెళ్లకపోవడంతో అతని భార్య శీనమ్మ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నంబూరి చంటిబాబు తెలిపారు.

నిర్వాసితుల ఖాతాల్లోకి ఆర్‌అండ్‌ఆర్ పరిహారం

కుక్కునూరు: గొమ్ముగూడెం గ్రామానికి సంబంధించి ఆర్ అండ్ ఆర్ పరిహారం రూ 6.36 లక్షలు సోమవారం బాధితుల ఖాతాలలో జమయ్యాయి. ముఖ్యమంత్రి రాకతో గొమ్ముగూడెం గ్రామస్తుల ఇబ్బందులు తీరిపోయాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్‌ఆర్ పరిహారంలో భాగంగా ఇంటి విలువలు కూడా నిర్వాసితుల ఖాతాలలో జమకానున్నట్టు సమాచారం. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పరిహారం జమకావడం పట్ల గొమ్ముగూడెం గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

కుళ్లిన స్థితిలో మృతదేహం గుర్తింపు

కుక్కునూరు : కుళ్లిన స్థితిలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. మండలంలోని అల్లిగూడెం ఫారెస్ట్ నర్సరీ ఎదురుగా ఉన్న చెరువు సమీపంలోని జామాయిల్ తోటలో ఓ మృతదేహం పడిఉండడాన్ని అటుగా వెళ్లిన వారు చూశారు. మృతదేహాన్ని ఫొటోలు తీసి వాట్సప్‌లో షేర్ చేయడంతో విషయం తెలిసింది. మృతదేహం ఒంటిపై ఉన్న బట్టల ఆధారంగా మృతదేహం మహిళదిగా గుర్తించారు.

9న విజయవాడలో మహాధర్నా

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న క్విట్ ఇండియా రోజున విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. ఏలూరు నగరంలో సోమవారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. జీఎన్‌టీ రోడ్డు, వసంత మహల్ సెంటర్, కర్రల వంతెన, పవరుపేట రైల్వే స్టేషన్ రోడ్డు, ఆర్‌ఆర్ పేట, ప్రభుత్వాసుపత్రి మీదుగా ఫైర్‌స్టేషన్ సెంటర్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు మాట్లాడారు. నాడు స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు క్విట్ ఇండియా పిలుపు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరిస్తూ దేశాన్ని తిరోగమన దిశకు తీసుకెళుతోన్న మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలనే పిలుపుతో క్విట్ మోదీ.. సేవ్ ఇండియా నినాదంతో విజయవాడలో కార్మిక సంఘాల నాయకత్వంలో ఈ నెల 9న మహాధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్మికుల హక్కులను కాలరాస్తోన్న నాలుగు లేబర్ కోడ్ విధానాలను తిప్పికొట్టాని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, మణిపూర్ మారణ కాండను నిరసిస్తూ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.కృష్ణమాచార్యులు, డీఎన్‌వీడీ ప్రసాద్, యు.వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, బి.జగన్నాధం, వి.సాయిబాబు, బి.సోమయ్య, పి.కిషోర్, బద్వా వెంకట్రావు, కాకర్ల శ్రీను, అప్పారావు, కె.రామకృష్ణ, ఎ.జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి



పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం జనార్దనస్వామికి, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు, గోవుకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి పంచహారతులు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు మినీ జాబ్ ఫెయిర్

జంగారెడ్డిగూడెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలోని త్రివేణి డిగ్రీ కళాశాలలో మంగళవారం మినీ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు తెలిపారు. ఈ మినీ జాబ్ ఫెయిర్ నందు మోహన్ స్పింటెక్స్, ముత్తూట్ ఫైనాన్స్, హెట్రో గ్రూప్స్, టీమ్ లీడ్స్‌ల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సుమారు 200 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 – 35 వయసు గల వారు అర్హులన్నారు. వివరాలకు 96425 98324, 96663 22032ను (9988853335 – టోల్ ఫ్రీ)ను సంప్రదించాలన్నారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ నకలుతో హాజరు కావాలని తెలియజేశారు.

సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



కౌలు రైతుకు భరోసా

కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. ఏటా గుర్తింపు కార్డులు అందిస్తూ పలు ప్రయోజనాలు కల్పిస్తోంది.

8లో ▸



మొక్కజొన్నలో మెలకువలు

ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగులో మెళకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

8లో ▸

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్



జిల్లా జూనియర్ ఫెన్సింగ్ జట్లను మంగళ వారం భీమ వరం ఫెన్సింగ్ క్లబ్‌లో ఎంపిక చేయ నున్నారు. 13 నుంచి భీమవరంలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగనున్నాయి.

8లో

న్యూస్‌రీల్

సకాలంలో అర్జీల పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలువురి నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. డీఆర్వో కె.కృష్ణవేణి, డీఎస్పీ బి.శ్రీనాథ్, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీపీఓ మల్లికార్జునరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



జి.రాజేశ్వరి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా వచ్చేనెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరి తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో కోర్టులు ఉన్న అన్ని ప్రదేశాల్లో లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. సివిల్, వాహన ప్రమాద, బీమా, చెక్ బౌన్స్, కుటుంబ వివాదాల కేసులు, శ్రీరామ్ చిట్స్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు మొదలైన చిట్‌ఫండ్ కేసులు, బ్యాంకు లావాదేవీలు, అన్నిరకాల రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులను రాజీ చేస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల మందు, పిల్లలకు టీకాలు వేయించడం మాత్రం ఆగకూడదు అనే నినాదంతో రెండు వాల్‌పోస్టర్లను కలెక్టర్ పి.ప్రశాంతి కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు, కిశోర బాలలకు ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తామన్నారు. అలాగే పిల్లలకు క్రమం తప్పక టీకాలు వేయించాలన్నారు. ఈనెల 7 నుంచి 12, సెప్టెంబర్ 11 నుంచి 16, అక్టోబర్ 9 నుంచి 14 తేదీల్లో చిన్నపిల్లలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు.

విధిగా మోడల్ కోడ్

గ్రామ సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికలకు మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ విధిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న మూడు పంచాయతీ సర్పంచ్‌లు, 28 వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. సోమవారం నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 14న ఉపసంహరణ, 19న పోలింగ్, ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా 3,700 మందికి సేవలు

భీమవరం (ప్రకాశంచౌక్): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీసెస్‌కు సంబంధించి జిల్లాలో 14 వాహనాల ద్వారా 2022 ఏప్రిల్ నుంచి గత నెల వరకు 3,700 మంది బాలింతలను సురక్షితంగా వారి ఇళ్లకు తరలించామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా హైరిస్క్ ప్రెగ్నెంట్, సివియర్ ఎనిమిక్ ప్రెగ్నెంట్ మహిళలను ఇంటి నుంచి ఆస్పత్రికి తీసుకువచ్చి, రక్తమార్పిడి అయిన తర్వాత వారిని ఇంటికి చేరుస్తున్నామన్నారు.

ఎన్జీఓ మహాసభల ద్వారా ఉద్యోగులకు మేలు

ఏలూరు టౌన్: ఎన్జీఓ రాష్ట్ర మహాసభల ద్వారా ఉద్యోగులకు మేలు జరగాలనీ, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంలో సామరస్యపూర్వక వాతావరణంలో చర్చల ద్వారా కృషి చేయాలని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఎన్జీఓ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ఆధ్వర్యంలో ఎన్జీఓ రాష్ట్ర 21వ మహాసభలకు ఎమ్మెల్యే ఆళ్ల నానికి ఆహ్వానం పలికారు.

వరద బాధితులకు బాసటగా..

గొమ్ముగూడెం.. జన నీరాజనం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు పోటెత్తిన గిరిపుత్రులు
- గ్రామ చరిత్రలో తొలిసారిగా సీఎం రాక
- కాలినడకన వరద బాధితులతో మమేకం
- ఆలకిస్తూ.. అభయమిస్తూ ముందుకు సాగిన వైనం



ఓ తోబుట్టువు సమస్య తెలుసుకుంటూ..



గొమ్ముగూడెంలో గ్రామస్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న సీఎం జగన్. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే బాలరాజు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/కుక్కునూరు/వేలేరుపాడు: వరదలు వచ్చినప్పుడు మేమేమీ అడగకుండానే అన్నీ చేసి ఇబ్బంది లేకుండా మమ్మల్ని చూసుకుంటున్న మీరు వెయ్యేళ్లు చల్లగా ఉండాలని ఓ అవ్వ దీవెనలు.. అన్నా రేషన్ నుంచి కూరగాయల వరకు అన్నీ అందాయి.. రెండు నెలల వరకు ఇబ్బంది లేకుండా వరదల నుంచి ఆదుకున్నావంటూ ఓ తోబుట్టువు ఆనందం.. ఇలా అడుగడుగునా గిరిసీమలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం నీరాజనం పలికారు. అశేషంగా తరలి వచ్చి సీఎం పర్యటన ప్రారంభం మొదలు తిరిగి పయనమయ్యేంత వరకు బారులు తీరారు. ముఖ్యమంత్రితో కరచాలనం చేసేందుకు, ప్రభుత్వ సాయంపై సంతృప్తి వ్యక్తం చేసి ధన్యవాదాలు చెప్పేందుకు పోటీపడ్డారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గంలోని కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలో పర్యటించారు. మధ్యాహ్నం 3 గంటలకు హెలీప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగిన ఆయన వాహనంలో గ్రామానికి వెళ్లారు. గ్రామంలో కిలోమీటరున్నర మేర కాలినడకన వెళ్లి వరద బాధితులతో మాట్లాడి కష్టసుఖాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గొమ్ముగూడెం చరిత్రలో గ్రామానికి మొదటసారిగా వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావడంతో ప్రజలు జేజేలు పలికారు. సీఎం జగన్ వాహనం నుంచి కిందకు దిగి దారి పొడవునా తన కోసం వేచి ఉన్న గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వరద సమయంలో అధికారులు అండగా ఉన్నారా అని అక్కచెల్లెమ్మలను పరామర్శించారు. నగదుతో పాటు ఐదు రకాల రేషన్ సరుకులు అందాయా అని ఆరా తీయగా, మాకు అన్నీ అందాయని, అధికారులు అన్నివిధాలా సహకారం అందించారని గ్రామస్తులు కృతజ్ఞతాపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలో పలువురు గ్రామస్తులు విన్నవించిన అర్జీలను సావధానంగా ఆలకించి తక్షణమే సమస్యల పరిష్కారానికి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామంలో మొత్తం 250 కుటుంబాలు ఉన్నాయి. వీరందరికీ ఆర్‌అండ్‌ఆర్ వ్యక్తిగత పరిహారం రూ.6.36 లక్షలు, ఇంటి విలువలు (స్ట్రక్చర్ వాల్యూస్) మొత్తం రూ.18 కోట్లు వారి ఖాతాల్లో జమయ్యాయి.



వరద బాధితుల ముఖాముఖిలో మాట్లాడుతున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, పినిపే విశ్వరూప్, ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, మేకా ప్రతాప్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించి..

అనంతరం ముఖ్యమంత్రి వ్యూ పాయింట్‌ను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. వరద నష్టం, గోదావరి ఉధృతి, గొమ్ముగూడెంతో పాటు కుక్కునూరు, వేలేరుపాడులో జరిగిన నష్టం, జిల్లా స్థితిగతులపై జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. జిల్లాలో వరద కారణంగా ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టాలు జరగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తుగా తీసుకున్న చర్యలు, వరద ప్రభావం, అనంతరం సిబ్బంది చేపట్టిన సహాయ పునరావాస కార్యక్రమాలు, పారిశుధ్య కార్యక్రమాలు, వైద్య శిబిరాలు తదితర వివరాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆయనకు వివరించారు. ముంపునకు గురైన గ్రామాలు, పునరావాస కార్యక్రమాలు, ఆర్థిక సహాయం వివరాలను కలెక్టర్‌ను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, హోం మంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, శాసనసభ్యులు తెల్లం బాలరాజు, ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్, కొఠారు అబ్బయ్యచౌదరి, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఉన్నమట్ల ఎలీజా, తలారి వెంకట్రావు, దూలం నాగేశ్వరరావు, ఏలూరు మేయర్ నూర్జహాన్, ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఆత్మీయ స్వాగతం



యువకుల కేరింతలు

బుట్టాయగూడెం/కుక్కునూరు: జిల్లాలోని వరద బాధితులను పరామర్శించేందుకు సోమవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.11 గంటలకు సీఎం జగన్ చేరుకున్నారు. ఆయన్ను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, హోం మంత్రి తానేటి వనిత, రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, శాసనమండలి సభ్యుడు కవురు శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి, మేకతోటి అప్పారావు, ఉన్నమట్ల ఎలీజా, దూలం నాగేశ్వరరావు, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తదితరులు ఆత్మీయ స్వాగతం పలికారు. డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యావేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీఓ ఎం.ఝాన్సీరాణి, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరామ్, రాష్ట్ర సాహిత్యమండలి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే పోలవరం పూర్తి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేది, నిర్వాసితులకు పూర్తిగా న్యాయం చేసేది ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డే అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితులను సీఎం జగన్ రెండు కళ్లుగా భావిస్తున్నారన్నారు. గోదావరి వరద బాధితులను అన్ని విధాలా ఆదుకున్నారన్నారు. 41.15 కాంటూరు పరిధిలో ఉన్న నిర్వాసితులందరికీ పూర్తి న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును ఏటీఎంగా వాడుకున్నాడే తప్ప ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితులకు న్యాయం చేయడంపై చిత్తశుద్ధి చూపలేదని విమర్శించారు. వరద బాధితులు, నిర్వాసితుల నుంచి సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో పోలవరం పనులను నీరుగార్చారని, పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సెల్ఫీలు దిగి, ఫోజులిస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో నిర్వాసితులను కనీసం పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. సీఎం జగన్ మళ్లీ గెలిచి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజలంతా ఆశిస్తున్నారని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు.

పర్యటన విజయవంతం : కుక్కునూరు మండలం గొమ్ముగూడెంలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమైందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఇందుకు కృషిచేసిన అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

● నేనున్నానని..



గొమ్ముగూడెంలో వృద్ధురాలి సమస్య తెలుసుకుని నేనున్నానంటూ భరోసా ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఉప్పొంగిన ఉత్సాహం.. గొమ్ముగూడెం గ్రామస్తుల కేరింతలు



మోములో సంతోషం.. సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో మహిళలు



ఆనంద పరవశం.. సీఎం జగన్ కరచాలనం కోసం..

చేనేతను ప్రోత్సహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ చేనేత దినోత్సవం స్ఫూర్తితో నేతదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పట్టణంలో జరిగిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చేనేత ఉత్పత్తుల స్టాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం స్పందన మందిరంలో చేనేత కార్మికులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ చేనేత ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేల చొప్పున జిల్లాలో 1,027 మంది లబ్ధిదారులకు అందజేస్తుందన్నారు. అలానే వృద్ధ చేనేత కార్మికులకు రూ.3 వేల పింఛన్ అందిస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీపీఓ మల్లికార్జునరావు, డీఈఓ ఆర్‌వీ రమణ మాట్లాడారు. ర్యాలీలో జిల్లా చేనేత జౌళి శాఖ ఇన్‌చార్జ్ ఏడీ బి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

'నా మట్టి.. నా దేశం' స్ఫూర్తిగా సెల్ఫీ

కలెక్టరేట్ ప్రాంగణంలో సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ పి.ప్రశాంతి సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో 'నా మట్టి–నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం' కార్యక్రమం స్ఫూర్తిగా సెల్ఫీ దిగినట్టు చెప్పారు. ఈనెల 9 నుంచి 20 వరకు కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్న ప్రభుత్వం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలో పది ఎలక్ట్రిక్ మూడు చక్రాల స్కూటీలను సోమవారం దివ్యాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలతో దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతున్నాయన్నారు. దివ్యాంగులు ఆత్మన్యూనత భావాన్ని వీడి దృఢ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో సాధారణ వలంటీరుగా తాను పనిచేశానని, తన సేవలను గుర్తించి సీఎం జగన్ కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగించారన్నారు. నియోజకవర్గానికి పది చొప్పున రాష్ట్రంలో 1,750 వాహనాలను మంజూరు చేయగా ఇప్పటివరకూ 1,200 వాహనాల పంపిణీ పూర్తయిందన్నారు. ఒక్కో వాహనం విలువ రూ.1.25 లక్షలని, దీనిని దివ్యాంగులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు.



దివ్యాంగులకు వాహనాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

కార్పొరేషన్ డైరెక్టర్ అనుపతి వెంకటయ్య, ఏపీ పట్టణ ప్రాంత ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వి.కళ్యాణి, ముప్పిడి సంపత్ కుమార్, గుండుబోగుల నాగు, ఎంపీపీ దాసరి హైమావతి, రెడ్డి సూరిబాబు, బొద్దాని శ్రీనివాస్, కోడే సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు. నియోజకవర్గంలో దివ్యాంగులకు వాహనాలు అందించడం అభినందనయమని వికలాంగుల సమాఖ్య పట్టణ అధ్యక్షుడు పులిమి లక్ష్మణరావు, సెక్రటరీ ఎంవీవీ రాఘవేంద్రా రెడ్డి కొనియాడారు. మంత్రి కొట్టు, కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

పోలీసు స్పందనలో 18 ఫిర్యాదులు



స్పందనలో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం : డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు ఫిర్యాదులు స్వీకరించారు. స్పందనలో 18 ఫిర్యాదులు అందగా వాటిలో ఎక్కువగా వరకట్న వేధిపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించినవి కావడం విశేషం. సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చింతలపూడి: చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో కొబ్బరి దింపు కార్మికుడు ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలికి చెందిన జి.వెంకటేశ్వర్రావు (52) గత 10 సంవత్సరాలుగా కొబ్బరి దింపు కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం రేచర్లలో కొబ్బరి తోటలో పనికి వెళ్ళిన వెంకటేశ్వర్రావు చెట్టుకు ఉరి వేసుకుని ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కె.ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతుకు భరోసా

- 84,664 మందికి గుర్తింపు కార్డులు
- ఈ ఏడాది లక్ష్యానికి మించి పంపిణీ



భీమవరం మండలం అనాకోడేరులో కౌలు రైతుకు సీసీఆర్ కార్డు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న కౌలు రైతు గుర్తింపు కార్డులు లక్ష్యానికి మించి పంపిణీ చేశారు. జిల్లాలో 20 మండలాల పరిధిలో 84,164 కార్డుల పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 84,664 కార్డులను పంపిణీ చేశారు. వ్యవసాయం పండుగ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగా కౌలు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్స్) కార్డులు మంజూరు చేస్తోంది. జిల్లాలో సుమారు 2.39 లక్షల ఎకరాల్లో సార్వా సాగు చేస్తుండగా.. దీనిలో ఎక్కువ భాగం కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు కౌలు రైతులు పొందేందుకు వీలుగా సీసీఆర్ కార్డులు జారీ చేస్తున్నారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 54,500 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు జారీ చేయగా, ప్రస్తుత సీజన్‌కు 84,164 కార్డులు ఇవ్వాలనే లక్ష్యాన్ని వ్యవసాయ శాఖ నిర్దేశించింది. గ్రామాల వారీగా ఆర్‌బీకే అసిస్టెంట్లు, వీఆర్ఏలు కౌలు రైతులను గుర్తించి కార్డులు జారీ చేసే ప్రక్రియ చేపట్టారు.

సీసీఆర్ కార్డు ప్రయోజనాలివే..

జిల్లాలో వరి సాగు చేస్తున్న వారిలో ఎక్కువ శాతం కౌలు రైతులే. రైతుల కోసం అమలుచేస్తున్న సున్నా వడ్డీ రాయితీ, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంకు రుణాలు, పంటల బీమా, వైఎస్సార్ రైతు భరోసా, ధాన్యం విక్రయాలు వంటి అనేక ప్రయోజనాలు కౌలు రైతులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీసీఆర్ కార్డుల ప్రక్రియ ప్రారంభించింది. గతంలో కౌలు రైతులు వరిసాగు చేస్తున్నా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు మాత్రం భూస్వాములకే దక్కేవి. దీంతో అహర్నిశలు కష్టపడి, పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడుతున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన సొమ్ములు భూస్వాముల బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యేవి. దీంతో కౌలు రైతులకు లబ్ధి చేకూర్చడానికి భూస్వాములకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీఆర్ కార్డులు జారీ ప్రారంభించారు. కౌలు గుర్తింపు కార్డు పొందిన కౌలు రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందుకోవడమేగాక పండించిన ధాన్యాన్ని నేరుగా విక్రయించుకుని తమ బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమచేయించుకునే అవకాశం ఏర్పడింది.

84,664 కార్డులు పంపిణీ చేశాం



జిల్లాలో అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డులు ఇస్తున్నాం. దీనిలో భాగంగా ఇప్పటికే 84,664 కార్డులు పంపిణీ చేశాం. సాగు హక్కుదారు పత్రాలు పొందిన వారికి ప్రభుత్వ రాయితీలన్నీ వర్తిస్తాయి. సీసీఆర్ కార్డులు ఇవ్వడం వల్ల భూయజమానులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

ఓటర్ల జాబితా పరిశీలన నూరుశాతం జరగాలి

స్పందనలో కలెక్టర్ ప్రశాంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ఓటర్ల జాబితా ఇంటింటా పరిశీలన కార్యక్రమం నూరు శాతం జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఓ కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసి రాజు, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, సహ ఎన్నికల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని దోషరహితంగా తయారు చేయాలని తెలిపారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని ప్రాధాన్యత అంశంగా తీసుకుని ఈనెల 21 లోగా పూర్తి చేయాలన్నారు. నిర్ణీత గడువు సమీపిస్తున్నందున ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఇంటింటి పరిశీలన కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో లింగ నిష్పత్తి అసాధారణంగా ఉందని దానిని సరిదిద్దాలన్నారు. ఓటర్లు-జనాభా నిష్పత్తి కూడా సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. మృతి చెందిన, వలసపోయిన, వివాహమై వేరే ప్రాంతాలకు వెళ్లిన మహిళల ఓట్లను సరైన విధానం అనుసరించి తొలగించాలన్నారు. ప్రతి ఓటరుకు ఇంటి సంఖ్య తప్పనిసరిగా వేయాలన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపులకు సంబంధించి పక్కా ఆధారాలు తీసుకోవాలన్నారు. పొంతన లేని ఓటర్లను కూడా గుర్తించి సరైన పద్ధతిలో సరిదిద్దాలన్నారు. సరిగా పనిచేయని బూత్ స్థాయి అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల ప్రాంతాల్లో అవసరాన్ని పరిశీలించి నూతన పోలింగ్ స్టేషన్ ఏర్పాట్లకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించాలి

వారానికి ఒకసారి తప్పనిసరిగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా గురించి వివరించాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తీసుకొని విచారించి తగిన విధంగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. మళ్లీ బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. యువ ఓటర్లు, వలస ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. జాబితా నుంచి ఎవరైనా ఓటర్లను తొలగిస్తే వారికి కచ్చితంగా నోటీసులిచ్చి వివరణలు తీసుకోవాలి, తొలగించడానికి కారణాలు సహేతుకంగా ఉండాలన్నారు.

టీడీపీ నేతలకు పోలీసు నోటీసులు

ద్వారకాతిరుమల: గోపాలపురం టీడీపీలో గ్రూపు రాజకీయాలు పోలీసులకు తలనొప్పిగా మారాయి. రెండు గ్రూపుల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు, ఎటువంటి ఘటనలకు దారితీస్తాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాకను పురస్కరించుకుని గోపాలపురం నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతలకు దేవరపల్లి పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ తరఫున బరిలో నిలిచేందుకు మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజులు పోటీ పడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే టీడీపీలోని బలమైన వర్గం మద్దిపాటికి వ్యతిరేకంగా ఇప్పటికే పలుమార్లు బహిరంగ సమావేశాలు నిర్వహించింది. దాంతో ఈ రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. మంగళవారం చంద్రబాబు రాకను పురస్కరించుకుని పార్టీ నేతలు దేవరపల్లి జంక్షన్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో రెండు వర్గాల నేతలు, వారి అనుచరులు ఒకరిపై ఒకరు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని పోలీసు నోటీసులో పేర్కొన్నారు. అనుమతి లేకుండా రెండు వర్గాలు బైక్ ర్యాలీలు నిర్వహించకూడదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగినా.. అవాంఛనీయ ఘటనలు జరిగినా తాము చేపట్టే చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

నరికిన చెట్టు నుంచి అరటి గెల



వీరవాసరం: నరికేసిన అరటి చెట్టు మధ్యలో నుంచి అరటి గెల వచ్చిన విచిత్ర ఘటన వీరవాసరం మండలం అండలూరు గ్రామం మేడిచర్ల శ్రీమన్నారాయణ పెరటి తోటలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో చెట్టును నరికి వేయగా చెట్టు మధ్యలో నుంచి అరటి గెల బయటకు వచ్చిందన్నారు. దీన్ని స్థానికులు విచిత్రంగా చూస్తున్నారు.

నేడు మల్లఖంబ్, రోప్ స్కిప్పింగ్ సెలెక్షన్స్

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్ హైస్కూల్లో ఈ నెల 8న జిల్లా స్థాయి మల్లఖంబ్, రోప్ స్కిప్పింగ్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శులు జీపీసీ శేఖర్‌రాజు, జి.భరత్‌వర్మ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అండర్-12, అండర్-14, అండర్-18, సీనియర్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12, 13 తేదీల్లో స్కూల్ ఆవరణలో నిర్వహించే 4వ రాష్ట్ర స్థాయి మల్లఖంబ్ చాంపియన్ షిప్, 16వ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొంటారని ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 11 గంటలకు వయస్సు ధ్రువీకరణ, ఆధార్ కార్డు, ఫొటోతో హాజరుకావాలని శేఖర్‌రాజు, భరత్‌వర్మ తెలిపారు.

బైక్‌లో పాము కలకలం



భీమవరం మునిసిపల్ కార్యాలయం వద్ద బైక్‌లో నక్కిన పసిరిక పాము కలకలం సృష్టించింది. పార్కింగ్ చేసిన బైక్‌లో పాము దూరడాన్ని గమనించిన వాహనదారుడు ఆందోళనకు గురయ్యాడు. పట్టణానికి చెందిన జి.హరి సొంత పని మీద సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయానికి వచ్చాడు. కార్యాలయ ఆవరణలో పల్సర్ బైక్ పార్కింగ్ చేస్తున్న సమయంలో పసిరిక పాము బైక్ హెడ్‌లైట్ నుంచి లోపలికి వెళ్లింది. దీంతో ఆందోళన చెందిన హరి అక్కడున్నవారికి విషయం తెలిపాడు. బైక్‌ను కొద్దిసేపు ఎండలో పెట్టి కర్రతో బైక్‌ను కొట్టినా పాము బయటకు రాలేదు. మరొక వ్యక్తి వచ్చి బైక్ సైడ్ ప్యానల్స్ తీయడంతో లోపల వైర్లకు చుట్టుకున్న పామును కర్రతో బయటకు తీశారు.

– సాక్షి, భీమవరం



ఖరీఫ్ మొక్కజొన్నలో మెలకువలు



చింతలపూడి: మొక్కజొన్న పంటను వర్షాధారంగా, సాగునీటి కింద పండిస్తారు. ఖరీఫ్ మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగు వివరాలను సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.నాగకుమార్ వివరించారు.

నేలలు

మురుగు నీరు పోయే లోతైన ఎర్రగరప, మధ్యస్థ నల్ల నేలలు మొక్కజొన్నకు అనుకూలం. నీరు నిల్వ ఉండే ముంపు నేలలు, చౌడు నేలల్లో దిగుబడి సరిగా రాదు. నేల ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 మధ్య ఉండాలి. సాధారణంగా జూన్ 15 నుంచి జూలై నెలాఖరు లోగా విత్తుకోవాలి. వర్షాలు ఆలస్యంగా కురిస్తే నీటి వసతి కింద స్వల్పకాలిక హైబ్రిడ్ రకాలు ఆగస్టు రెండో వారంలో కూడా విత్తుకోవచ్చు.

అనువైన రకాలు

- దీర్ఘకాలిక రకాలు : డీహెచ్ఎం -113, 900 ఎం గోల్డ్, బయో 9861, ప్రో-311, 30బి07
- మధ్య కాలిక రకాలు : డీహెచ్ఎం-111, 117, 119, కెహెచ్-510, బయో- 9657, కెఎం -9541, ఎంసీహెచ్-2
- స్వల్పకాలిక రకాలు : డీహెచ్ఎం- 115, ప్రకాశ్ కెహెచ్-5991, జెకెఎంఎచ్-1701-డీకేసీ-7074 ఆర్, ఎంఎంఎచ్-1701, డికెసి- 7074 ఆర్, ఎంఎంఎచ్- 133, 3342

ప్రత్యేక రకాలు

- తీపి మొక్కజొన్న (స్వీట్ కార్న్) : మాధురి, ప్రియ, విన్ ఆరెంజ్, అల్మోరా రకాలు, సుగర్-75, బ్రైట్‌జీన్ సంకర రకాలు.

విత్తన శుద్ధి, ఎరువులు

- విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ లేదా డైథేన్ ఎం-45 కలిపి విత్తన శుద్ధి చేసి బోదెకు ఒక పక్కగా విత్తాలి.
- ఖరీఫ్ పంటలో ఎకరాకు 72-80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వాడాలి. జింక్ లోపం ఉంటే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. జింక్ లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ ద్రావణం పిచికారీ చేయాలి.

కలుపు నివారణ

పంట విత్తుకున్నాక 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. మొక్కజొన్న పంటను ఏక పంటగా వేసినప్పుడు నేల రకాన్ని బట్టి ఎకరాకు 800-1200 గ్రా అట్రాజిన్ పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట విత్తిన వెంటనే లేదా 2-3 రోజుల్లోగా పిచికారీ చేసి కలుపును నివారించవచ్చును. వెడల్పాటి కలుపు మొక్కల నివారణకు విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు అరకిలో 2, 4-డి సోడియం సాల్ట్‌తో పిచికారీ చేయాలి.

నీటి తడులు

వర్షాధారంగా సాగు చేసినా పూత దశలో వర్షాభావ పరిస్థితులేర్పడితే వీలున్న చోట నీరు తడిపితే మంచి దిగుబడులు వస్తాయి. పూత దశ, గింజలు ఏర్పడే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. పైరు తొలి దశలో పొలంలో నీరు నిల్వ లేకుండ జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ

పైరు తొలి దశలో ఆశించే మొవ్వ తొలిచే పురుగు నివారణకు ముందు జాగ్రత్తగా విత్తిన 10-12 రోజులకు పైరుపై మోనోక్రోటోఫాస్ (1.6 మి.లీ) లేదా కోరా ఎన్ (3 మి.లీ) లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్బోఫ్యురాన్ 3జీ గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు 25-30 రోజుల దశలో వేయాలి. ఆకు మాడు తెగులు నివారణకు మాంకో జెబ్ (2.5 గ్రా) లీటర్ నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పొడ తెగులు లక్షణాలు కనిపిస్తే మొక్క దిగువనున్న 2-3 ఆకులు తుంచివేసి ప్రాపికొనజోల్ (1 మి.లీ.) లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్క ఎండు, కాండం మసికుళ్ళు తెగుళ్ళు రాకుండ ముందు జాగ్రత్తగా ఎదుర్కొనే రకాల సాగు, పంట మార్పిడి, వేసవిలో లోతు దుక్కులు, పూత దశ తర్వాత నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.




బి.నాగకుమార్
సహాయ వ్యవసాయ సంచాలకుడు, చింతలపూడి సబ్ డివిజన్

గడపగడపకు సంక్షేమం



కాళ్ల : మండలంలోని దొడ్డనపూడిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

బ్రాహ్మణ సంఘాలు కలిసికట్టుగా ఉండాలి



మాట్లాడుతున్న జ్వాలాపురపు శ్రీకాంత్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బ్రాహ్మణ సంఘాలన్నీ కలిసికట్టుగా ఉండాలని తద్వారా తమ డిమాండ్ల సాధనకు మార్గం సులభమవుతుందని దేవదాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ తెలిపారు. నగరంలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణుల అభివృద్ధికి కోసం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఒక పురోహిత సంఘం పౌరోహిత్యం కుల వృత్తిగా కావాలని డిమాండ్ చేస్తుందని, పురోహితులుగా ఉన్నవారిలో ఈ డిమాండ్‌కు ఎవరు మద్దతు తెలుపుతున్నారో తన దృష్టికి తీసుకు వస్తే ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

నేడు భీమవరంలో ఫెన్సింగ్ జట్ల ఎంపిక

సాక్షి, భీమవరం: రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 13న భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ సోమవారం చెప్పారు. జిల్లా జూనియర్ ఫెన్సింగ్ టీం సెలెక్షన్స్ ఈ నెల 8న మంగళవారం సాయంత్రం 4 గంటలకు భీమవరం ఫెన్సింగ్ క్లబ్‌లో ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2005 నుంచి 2010 మధ్య పుట్టినవారై ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్‌తో పాటుగా ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటు వ్యక్తిగత ఫెన్సింగ్ ఎక్విప్‌మెంట్‌తో సెలక్షన్ హాజరుకావాలన్నారు. ఇతర వివరాల కోసం 63042 52121, 96802 34566 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతూ ఒక యువకుడు మృతిచెందాడు. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పంగిడిగూడెం గ్రామానికి చెందిన గంజి లక్ష్మణరావు(27) కేతవరంలో బొప్పాయి కాయలు లారీలో లోడు చేసుకునేందుకు వెళ్లారు. బొప్పాయి కాయలు ఉన్న పెట్టెను భుజంపై పెట్టుకుంటుండగా, పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో అతన్ని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' మస్కట్ పోటీలు

ఏలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 17 ఏళ్ల పైబడిన యువతీ, యువకులను ప్రోత్సహించడానికి సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించనున్నామని ఏలూరు జిల్లా సెట్‌వెల్ సీఈఓ ఎండీ హెచ్ మెహర్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8 వరకూ క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకూ గ్రామ సచివాలయం స్థాయి, అక్టోబర్ 9 నుంచి 23 వరకూ మండల స్థాయి, అక్టోబర్ 24 నుంచి 29 వరకూ నియోజకవర్గ స్థాయి పోటీలు చేపట్టనున్నామని వివరించారు. ఆఖరి దశ నవంబర్ 5 నుంచి 8 వరకూ రాష్ట్ర స్థాయి పోటీలు చేపడుతుందన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముందుగా లోగో, మస్కట్ డిజైన్ పోటీలు నిర్వహించి, విజేతలకు మొదట బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు.

క్లుప్తంగా

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.కృష్ణ సత్యలత

తణుకు అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏలూరు ఫస్ట్ అడిషినల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.రామగోపాల్ ఆధ్వర్యాన వచ్చే నెల 9వ తేదీన తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తణుకు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కోర్టు ఆవరణలో తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించి అన్ని సివిల్ కేసులతో పాటు రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరిస్తామని వివరించారు. న్యాయవాదులంతా ఈ జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కంచుమర్రులో శాంతియుత ర్యాలీ

అత్తిలి: మణిపూర్ ఘటనను నిరసిస్తూ కంచుమర్రు గ్రామంలో సోమవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో శాంతి సమాధానం కలగాలని, అన్ని రీతులుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఉనికిలి ప్యారీస్ కంచుమర్రు పెదపేట సెయింట్ పాల్స్ లూథరన్ దేవాలయం సంఘ కాపరి బూసి జయప్రసాద్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో కె.శ్యాంప్రసాద్, వి.మార్కండేయులు, కె.సునీల్‌కుమార్, కె.బాబు, సండే స్కూల్ యూత్, స్త్రీ సమాజం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వార్డు సచివాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం డెమోక్రటిక్ అసోసియేషన్ నాయకులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో శాశ్వత భవనాలు, మౌలిక వసతులు కల్పన, ఇతర సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కార్యదర్శి జి.జోసెఫ్ కిషోర్, జిల్లా అధ్యక్షుడు వి.జోగేంద్రకుమార్, పి.నాగబాబు, తదితరులు ఉన్నారు.

ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు

పెంటపాడు: రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న నాణ్యమైన కాంప్లెక్స్ ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.పార్థసారధి కోరారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీని ప్రారంబించారు. కాగా ఇప్పటివరకు రైతుల అవసరం మేరకు 300 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు మండలానికి చేరినట్లు ఏవో తెలిపారు.

కేంద్ర బృందం పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్ : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023లో భాగంగా సోమవారం మండలంలోని ఆరుగొలను, కొత్తూరు గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి, అంగన్‌వాడీ, పాఠశాలలు, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, డీపీఆర్‌సీ ఎడ్వర్డ్, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాస చంద్రరాజు పాల్గొన్నారు.

మానవత్వంతో సేవలందించాలి



అవార్డులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: మానవాళి ఉన్నంత వరకూ సమాజం, సంపాదనలో అసమానతలు సహజమని, సేవా దృక్పదం ఉన్న వ్యక్తులు సంఘాలుగా ఏర్పడి సేవలందించాలని లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కోరారు. ఆదివారం విశాఖపట్టణంలోని గ్రీన్ పార్క్ కన్వెన్షన్ హాలులో జరిగిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని వివిధ లయన్స్ క్లబ్‌ల్లో విశేష సేవలందించిన వ్యక్తులు, సంఘాలకు ఆయన అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాజిక సేవల ద్వారా పొందిన సంతృప్తి జీవిత చరమాంకం వరకూ ఆనందాన్నిస్తుందన్నారు. కార్యక్రమంలో పూర్వ లయన్స్ గవర్నర్ ఎం.ఉషారాణి అధ్యక్షత వహించారు. వైస్ గవర్నర్ ప్రసాద్ డి.సూర్యప్రకాష్,, పూర్వ గవర్నర్లు రాఘవేంద్రరావు, డి.రమేష్ రాజు, డీవీఎస్ వర్మ, ఎం.శర్మ, జి.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో 'చేనేత'దే ప్రధాన భూమిక

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



వేల్పూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న చేనేత కార్మిక సంఘం నాయకులు

తణుకు టౌన్: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత ప్రధాన భూమిక పోషించిందని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు చెప్పారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వేల్పూరులోని టైలర్స్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి పతాకాన్ని ఆవిష్కరించారు. 1905లో విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ ఉద్యమంలో భాగంగా మొదటి సారిగా కలకత్తాలో స్వదేశీ ఉద్యమానికి అంకురార్పణ చేశారని, అదే స్ఫూర్తితో ప్రతి ఏటా జాతీయ చేనేత దినోత్సవాన్ని పాటిస్తున్నారని చెప్పారు. చేనేతలపై ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయాలని, చేనేత ఉత్పత్తులు, రంగు నూలు, రసాయనాలు, ముడి సరుకులపై వేసిన జీఎస్టీని తక్షణం రద్దు చేసి చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో వేల్పూరు చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు తాడిశెట్టి వీరభద్రుడు, గుడిమెట్ల సోమలింగం, అందే వరలక్ష్మి, చల్ల పూర్ణయ్య, వాసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలి

అత్తిలి: చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని బల్లిపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ అన్నారు. పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దత్ మాట్లాడుతూ చేనేత వస్త్రం ధరించడంవల్ల మానవుని చర్మం హాయిగా శ్వాసించగల్గుతుందని, చేనేత వస్త్రాలను అన్నికాలాల్లోనూ అందరూ ధరించవచ్చన్నారు. భారతీయ నాగరితకకు చేనేత పరిశ్రమ చిహ్నం అని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం మగ్గం, వాటి భాగాలు, నూలు దారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.పురుషోత్తం, డీఎంజీ ప్రసాద్, ఎస్‌కే మల్లేశ్వరరావు, హర్షద్, మాధవరావు విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో ర్యాలీ

పెంటపాడు: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రామచంద్రపురం గ్రామంలో వైఎస్సార్ సీసీ కన్వీనర్ చల్లా లింగమూర్తి, మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి ఆధ్వర్యాన చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక చేనేత వీవర్స్ సొసైటీ కార్యాలయం నుండి గ్రామంలోని పలు ప్రాంతాల మీదుగా ర్యాలీ సాగింది. లింగమూర్తి, కుమారస్వామి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నేతన్న కుటుంబానికి రూ. 25వేలు అందించి ఆదుకోవడం గర్వకారణమన్నారు. మీనవిల్లూరు, రామచంద్రపురం గ్రామాల్లో సుమారు 65 మందికిపైగా 5 ఏళ్లలో ఏడాదికి రూ. 25వేలు చొప్పున మగ్గానికి నిధులు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో చేనేత వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు నిల్లా నాగన్న, సర్పంచ్ చల్లా నాగమణి, కార్యదర్శి, వీఆర్వో పాల్గొన్నారు.

దోపిడీపై పాటతో పోరాడిన గద్దర్



తణుకులో నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు , కవులు, రచయితలు

తణుకు టౌన్: పెత్తందారి దోపిడీకి వ్యతిరేకంగా తన ఆటపాటలు, మాటలతో పీడిత ప్రజల విముక్తికోసం పోరాడిన మహావ్యక్తి గద్దర్ అని కవులు, రచయితలు, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం తణుకులోని సురాజ్య భవన్‌లో నిర్వహించిన గద్దర్ సంతాపం సభకు న్యాయవాది గొల్లపల్లి అంబేద్కర్ అధ్యక్షత వహించారు. సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు పేరూరి మురళీ కుమార్ మాట్లాడుతూ సాయుధ పోరాటంతోనే రాజ్యాధికారం సిద్ధిస్తుందనే ఆలోచనను మార్చుకుని పూలే, అంబేద్కర్ బాటలో బ్యాలెట్ ద్వారా అధికారంలోకి తీసుకువచ్చేందుకు పాటుపడతానని చివర వరకూ నిలబడ్డారని చెప్పారు. సభలో శ్రీలంక బౌద్ధ గురువు బోధి హీన్, నక్కా అజయ్, కేఎస్‌పీఎస్ జాన్ రాజు, కార్మిక నేత మస్తాన్, పౌర హక్కుల నేత కౌరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంత్రి కొట్టు సంతాపం

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. తన పాటల ద్వారా ప్రజానీకాన్ని జాగృతం చేసిన చైతన్యమూర్తిగా అభివర్ణించారు. సామాన్యుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన ప్రజా నాయకుడిగా జనం గుండెల్లో నిలిచిపోయారన్నారు. ప్రజలకు న్యాయం అందించేందుకు పరితపించిన మహా మనిషి గద్దర్ అని అన్నారు. అందరి వాడిగా గుర్తింపు పొందిన గద్దర్ మరణం విచారకరమన్నారు. గద్దర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని మంత్రి కొట్టు తెలిపారు. గద్దర్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

ఉద్యమాలకే తీరని లోటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విప్లవ కవి, ప్రజా గాయకుడు గద్దర్ మరణం ఉద్యమాలకే తీరని లోటని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబురావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గద్దర్ తన ఆటపాటలు, కళా రూపాల ద్వారా అట్టడుగు వర్గాలకు చెందిన గ్రామీణ ప్రాంత ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారని తెలిపారు. పాటలతో భూస్వాములు, పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడంలో ప్రముఖమైన పాత్ర పోషించారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గద్దరు అంతిమ యాత్రను అధికారిక లాంఛనాలతో నిర్వహించి సముచితంగా నిలిచిందని బాబురావు అన్నారు.

ఘన నివాళి

ఇరగవరం: మండలంలోని కంతేరు గ్రామంలో సోమవారం ప్రజా కవి, పోరాట నౌకా గుమ్మడి విఠల్ (గద్దర్) చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత నాయకుడు సబ్బితి చిన్నరాయుడు మాట్లాడుతూ దళితులు, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అలుపెరగని ఉద్యమం చేసిన పోరాట యోధుడు గద్దర్ అని పేర్కొన్నారు. పాట, ఆట ద్వారా ప్రజలను చైతన్య పరిచిన మహోన్నత వ్యక్తి గద్దర్ అన్నారు. కార్యక్రమంలో మేడిది వెంకట స్వామి, మేడపాటి రమేష్ బాబు, సరెళ్ళ బన్ను, సబ్బితి భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వార్డు పదవులకు 19న ఎన్నికలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి, ముద్దాపురం గ్రామాల్లోని రెండు వార్డు సభ్యుల పదవులకు ఈనెల 19వ తేదీన ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. తేతలి గ్రామంలోని 8వ వార్డు, ముద్దాపురంలోని 10వ వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11, 12 తేదీల్లో నామినేషన్ల పరిశీలన, 14వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ, అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, అవసరమైతే ఈనెల 19వ తేదీన ఎన్నికల నిర్వహణ, అదే మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని తెలిపారు.

పెంటపాడులో మోటార్ సైకిల్ ర్యాలీ

పెంటపాడు : కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పెంటపాడులో ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమసుందర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కేంద్రాన్ని గద్దె దించేందుకు కార్మికులు ఐక్యంగా కృషి చేస్తామన్నారు. కేంద్ర,, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు మాట్లాడారు. మోటార్ సైకిళ్ల ర్యాలీ పెంటపాడు గేట్ సెంటర్, సంత బజార్, కళాశాల సెంటర్, పెంటపాడు గాంధీ సెంటర్‌కు చేరుకుంది.

కార్మిక మహాధర్నాను విజయవంతం చేయాలి



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ కార్మిక వర్గం ఆధ్వర్యంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ హెచ్చరించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరగనున్న కార్మిక వర్గ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక సీడబ్ల్యూసీ గోదాముల సెంటర్ నుంచి ప్రారంభమై ఆర్టీసీ డిపో, తాలూకా ఆఫీస్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి, టూ టౌన్‌లోని విజయ టాకీస్ సెంటర్, తాళ్ళ ముదునూరుపాడు, మీదుగా పెంటపాడు మండల కేంద్రానికి చేరింది. అనంతరం పెంటపాడు ప్రధాన వీధుల్లో ర్యాలీ కొనసాగింది. పట్టణంలోని సిపాయిపేటలో భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయం వద్ద ర్యాలీ ముగిసింది. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మికుల స్థితిగతులు దుర్భరంగా మారాయన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా, ప్రజా పోరాటాలు చేసినా కేంద్రప్రభుత్వం పెడచెవిన పెడుతోందని, కోర్కెలు పరిష్కారం కాని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ర్యాలీలో భవన నిర్మాణ, మున్సిపల్, సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ, నియోజకవర్గ కార్మిక సంఘాలు, ఏఐటీయూసీ నాయకులు ఓసూరి వీర్రాజు, పడాల శ్రీనివాస్, మెండెం జేమ్స్, కళింగ లక్ష్మణరావు, తాడికొండ శ్రీనివాసరావు, పోలిరాతి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఐలు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



తణుకులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న న్యాయవాదులు

తణుకు అర్బన్ : ఈనెల 12, 13 తేదీల్లో గుంటూరులో నిర్వహించ తలపెట్టిన ఐలు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి కోరారు. తణుకు బార్ అసోసియేషన్ భవనం వద్ద సోమవారం రాష్ట్ర మహాసభలకు సంబంధించి ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ మహాసభల్లో న్యాయవాదుల సమస్యలపై చర్చిస్తామని, న్యాయవాదుల రక్షణ కోసం చట్టం కోరుతూ ప్రభుత్వానికి తీర్మానం చేస్తామని వివరించారు. అంతేకాక వివిధ కోర్టుల పరిధిలో న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, డి.అప్పారావు, యు.పుల్లేశ్వరరావు, కె.శ్రీనివాస్, వి.వెంకటకృష్ణ, డి.భాస్కరరావు, ఆర్‌వీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి ఆల్బెండజోల్ మాత్రల అందజేత



మాత్రలు అందజేస్తున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: బాలబాలికల్లో రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపకరిస్తాయని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్ళ లోపు బాలబాలికలతో ఈ మాత్రలు మింగించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మాత్రలు మింగించిన తర్వాత పిల్లల ఆరోగ్య పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఏఎన్ఎంకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వి.హనుమ, ఎంఈవో-2 పీఎంకే జ్యోతి, డాక్టర్ ఎస్.శ్రీహర్ష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, సీఆర్‌పీ బత్తుల నానిబాబు పాల్గొన్నారు.

జీవామృత తయారీపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

పెంటపాడు : జీవామృత తయారీపై రైతులు ఆసక్తి పెంచుకుని ప్రధానంగా ప్రకృతి వ్యవసాయ రైతులు చీడపీడలను నివారించుకోవాలని ప్రకృతి వ్యవసాయ మండల కో ఆర్డినేటర్ జి.వీర్రాజు సూచించారు. పెంటపాడు యూనిట్ పరిధి మీనవిల్లూరు గ్రామంలో రైతులకు సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజామృతం, జీవామృతం తదితర ద్రావణాలు వల్ల చీడపీడలను నివారించుకునే విధానాన్ని రైతులకు వివరించారు. సార్వా పంటలో ప్రధానంగా చీడపీడలు నివారించే శక్తి కేవలం బీజామృతానికే ఉందన్నారు. ప్రధానంగా విత్తనశుద్ధి చేసుకుంటే పంటను అధికశాతం చీడపీడల నుండి రక్షించుకోవచ్చన్నారు. గ్రామానికి 100 కిట్లు తయారు చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు కిట్‌లు అందజేశారు. ప్రకృతి వ్యవసాయ గ్రామాల వలంటీర్లు, ప్రతినిధులు, గ్రామ రైతులు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

నీటి నిల్వలపై చైతన్యపర్చండి



ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరావు



తణుకులో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్ : దోమ పుట్టుకకు చెక్ పెట్టే డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రజలు ప్రామాణికంగా పాటించేలా ఆశా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆశా డే సందర్భంగా తణుకులోని 3 అర్బన్ హెల్త్ సెంటర్లలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ డి.సుప్రియ, డాక్టర్ కె.పృథ్వీరాజ్, డాక్టర్ రాజా నాగభూషణం ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈనెల పొడవునా ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఫిజికల్‌గా చెక్ చేయాలని సూచించారు. అవసరం లేని నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించేలా ప్రజలను చైతన్యపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారి సునీత, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు కోరారు. సోమవారం పట్టణంలోని ఆరోగ్య కేంద్రాలు యాగర్లపల్లి, వీకర్స్ కాలనీ, కడకట్ల, బీవీ సెంటర్లలో వైద్యులు ఎస్.అమృత, కె.ఆశాలత, శ్రావ్య, చైతన్య అధ్యక్షతన ఆశా డే సమావేశాలు నిర్వహించారు. లక్ష్మణరావు హాజరై కీటక జనిత వ్యాధులు, ముందస్తు కీటక నియంత్రణ చర్యలు, వైక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఆశా నోడల్ అధికారులు వై.సుజాత, ఎన్.ప్రసన్న, వార్డు ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆరోగ్య సంరక్షణకు హెల్త్ స్కీమ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల ఆరోగ్య సంరక్షణలో నిరామయ హెల్త్ స్కీమ్ ఎంతగానో దోహదపడుతుందని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాలీశ్వరయ్య తెలిపారు. సోమవారం భవిత సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటిజం, సెరిబ్రల్‌పాల్సీ, మానసిక వైకల్యం, బహుళ వైకల్యాలు ఉన్న దివ్యాంగులకు హెల్త్ ఇన్సూరెన్స్ ఎంతో ఉపయుక్తం అన్నారు. దివ్యాంగుల సంరక్షణకై పనిచేస్తున్న నేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరామయ హెల్త్ స్కీమ్ ఏర్పాటు చేశారని, రూ.లక్ష ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా ఉచితంగా చికిత్సలు లభిస్తాయని తెలిపారు. హెల్త్ స్కీంలో చేరేందుకు మండలంలోని పాఠశాలల్లో దివ్యాంగులు తమ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మండలంలోని భవిత కేంద్రాలలో పనిచేస్తున్న సహిత విద్యా రిసోర్స్‌పర్సన్‌లు, హైస్కూల్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌ను సంప్రదించాలన్నారు.

వాసవిలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్

తాడేపల్లిగూడెం : వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్లు నమోదు కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్టు పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ కోసం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెబ్ ఆప్షన్ల నమోదు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు కళాశాలకు వచ్చి వెబ్ ఆప్షన్లు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే లక్ష్యం



కిట్లు పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకుడు సాంబయ్య



మండపాకలో రేషన్ కిట్లను పంపిణీ చేస్తున్న వైసీపీ నాయకుడు బోడపాటి వీర్రాజు



జగన్నాథపురంలో కిట్లను అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు కోరారు. సోమవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ స్థాయిలో గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు, చిన్నారులు, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జానా వెంకటలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ వై.విజయమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కృష్ణ కుమారి, గ్రామ కార్యదర్శి యుగంధర్ శ్రీనివాసు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు చుండ్రు శ్యామల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె కృష్ణకుమారి, పాల్గొన్నారు. దువ్వ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, సర్పంచ్ అడ్డా బాబు, ఉప సర్పంచ్ వీరబాబు పాల్గొన్నారు.

దర్శిపర్రులో కిట్లు పంపిణీ

పెంటపాడు: తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల గౌరవాధ్యక్షుడు, దర్శిపర్రు సొసైటీ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య కోరారు. సోమవారం గ్రామంలో జరిగిన గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలాగే ఐసీడీఎస్ సిబ్బంది తల్లులకు చిన్నారుల పోషణ, తల్లిపాల ఆవశ్యకత, శిశువుల ఆరోగ్యం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో 5 అంగన్‌వాడీ సెంటర్లలో సుమారు 57 మందికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు తోట నిరీక్షణరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గుండుమోగుల మునీంద్ర, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుజాత, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే పోషకాహారం

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దనే పోషకాహారం కిట్లను అందిస్తున్నట్లు జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక తెలిపారు. సోమవారం గ్రామంలో గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ పోషణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా పొందాలన్నారు. తద్వారా వారి సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నార్ని నాగులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చినరాముని చెరువులో..

ఇరగవరం: ఇరగవరం శివారు చినరాముని చెరువులో సోమవారం తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, టేక్ హోం రేషన్ అందజేశారు. అనంతరం తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ బి.సుశీల, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.